సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



కదులుతున్న డొంక

నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఘటన డొంక కదులుతోంది.

వివరాలు 8లో ▸



మన్యంకొండ.. జనసంద్రం

మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం జనసంద్రమైంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.4 /16.8

వాతావరణం

ఉదయం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జైలు అదాలత్‌లో ఆరు కేసులు పరిష్కారం



పాలమూరు: రాష్ట్ర న్యాయ సేవాధికార **సంస్థ** ఆదేశాల మేరకు జిల్లా జైలులో శనివారం జైలు అదాలత్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి కె.మమతారెడ్డి హాజరై జైలు అదాలత్‌లో మొత్తం ఆరు కేసులు పరిష్కరించారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు వారిపై మోపబడిన నేరాన్ని ఒప్పుకోవడంతో వారు అనుభవించిన జైలు శిక్ష కాలాన్ని తీసివేసి.. కొంత కాలం శిక్ష పూర్తి అయిన తర్వాత వారిని విడుదల చేయాలని జైలు అదాలత్‌లో ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో న్యాయమూర్తులు ఉపాధ్యాయ్, విజయ్‌కుమార్, దరావత్ ఉదయ్‌నాయక్, సయ్యద్ జకీయా సుల్తానా, మహ్మద్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 25న ప్రాంతీయ పోస్టల్ పెన్షన్ అదాలత్

స్టేషన్ మహబూబ్‌నగర్: వచ్చే నెల 25న వీసీ ద్వారా హైదరాబాద్ ప్రాంతీయ పోస్టల్ పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ విజయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ రీజియన్ కార్యాలయం పోస్టు మాస్టర్ జనరల్ వద్ద ఉంటుందన్నారు. ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణకు వచ్చేనెల 20 చివరి తేదీ అని చెప్పారు.

పీయూలో ఉర్దూ విభాగం ఏర్పాటు చేయాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు యూనివర్సిటీలో ఉర్దూ విభాగం ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం వీసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఉర్దూ భాష సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు, స్థానిక విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు పీయూలో ఎంఏ ఉర్దూ కోర్సును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఉర్దూ మాట్లాడే వారి సంఖ్య ఎక్కువ అని, పీయూలో ఉర్దూ విభాగం లేకపోవడంతో ఏటా వందలాది మంది విద్యార్థులు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. స్థానిక ఎన్టీఆర్ డిగ్రీ మహిళా కళాశాల, ఎంవీఎస్ కళాశాలల్లో ప్రతి ఏడాది 400 మందికిపైగా ఉర్దూ గ్రాడ్యుయేట్లు ఉత్తీర్ణులవుతున్నారని, దీంతో ఎంఏ, పీహెచ్‌డీ అందుబాటులో లేకపోవడంతో చాలామంది పై చదువు చదవలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఆల్‌మేవా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ వహీద్‌షా, రాష్ట్ర కోశాధికారి మహ్మద్ అబ్దుల్ రషీద్, జిల్లాశాఖ ఉపాధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖలీల్, సలహాదారులు యూసుఫ్ బిన్ నాసర్, సయ్యద్ ఖాజా నిజాముద్దీన్, షంసుద్దీన్ పాల్గొన్నారు.

'రాజాపూర్ ఘటన'పై బదిలీ వేటు


మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ రాజాపూర్: జిల్లాలోని రాజాపూర్ కేజీబీవీలో కొన్ని రోజులుగా సీఆర్టీల మధ్య గొడవ, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం, భోజనం సరిగా పెట్టకపోవడం వంటి అంశాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. ఈ వ్యవహారాలపై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలోనే ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారులు, ఆర్జేడీ విజయలక్ష్మి విచారణ చేపట్టారు. విచారణ రిపోర్టును కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె శనివారం చర్యలకు ఉపక్రమించారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి పావనిని దేవరకద్ర కేజీబీవీకి బదిలీ చేయగా.. దేవరకద్ర ప్రత్యేకాధికారిని రాజాపూర్‌కు బదిలీ చేశారు. సీఆర్టీ మంజులను మిడ్జిల్, మరో సీఆర్టీ సుకీర్తిని చిన్నచింతకుంటకు బదిలీ చేసినట్లు డీఈఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా ఈ ఘటనపై విద్యాశాఖ ఆధ్వర్యంలో మరోసారి పూర్తిస్థాయిలో సూపరింటెండెంట్, అడిషనల్ డైరెక్టర్, రాజాపూర్ ఎంఈఓ ఆధ్వర్యంలో మరో కమిటీ వేయనున్నారు. ఈ విచారణలో ఆరోపణలు నిజమని తేలితే వీరిని విధుల నుంచి తొలగించే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారుల్లో చర్చ జరుగుతుంది.

వేరుశనగ @ రూ.7,044

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ.7,044, కనిష్టంగా రూ.5,369 ధరలు లభించాయి. అలాగే ఆముదాలు క్వింటాల్ సరాసరిగా రూ.5,822, పత్తి గరిష్టంగా రూ.6,262, కనిష్టంగా రూ.5,501, కందులు గరిష్టంగా రూ.7,149, కనిష్టంగా రూ.5,097, పెబ్బర్లు గరిష్టంగా రూ.6,870, కనిష్టంగా రూ.5,001 ధర వచ్చాయి.

సొరంగంలోనే ఎనిమిది మంది

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులు



ప్రమాదం జరిగిన ఎస్‌ఎల్‌బీసీ సొరంగం (టన్నెల్) ఇదే..

- ఘటనా స్థలానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి, కలెక్టర్, ఎస్పీ
- కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు
- రంగంలోకి ఎన్డీఆర్‌ఎఫ్, ఫైర్, సింగరేణి రెస్క్యూ బృందాలు
- భారీ ఎత్తున నీటి ఊట, బురద, శిథిలాలతో సహాయక చర్యలకు ఆటంకం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికులను బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలో చేపడుతున్న ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణ పనుల్లో ఇన్‌లెట్ టన్నెల్‌లో 14 కి.మీ., వద్ద సొరంగం పైకప్పు కూలి ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో ప్రమాదం సంభవించగా, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. సొరంగంలో నీటి ఊట ఉధృతి పెరిగి, మట్టి వదులు కావడం, అకస్మాత్తుగా కాంక్రీట్ సెగ్మెంట్ ఊడిపడటంతో ప్రమాదం సంభవించింది. టన్నెల్ బోరింగ్ మిషన్‌కు ఇవతల వైపు ఉన్న సుమారు 50 మంది బయటకు పరుగులు తీసి ప్రాణాలను దక్కించుకోగా.. అవతల వైపు ఉన్న 8 మంది సొరంగంలోనే చిక్కుకుపోయారు. వారిని బయటకు తీసేందుకు సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. సుమారు 150 మంది ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది, అగ్నిమాపక, సింగరేణి కాలరీస్‌కు చెందిన రెస్క్యూ టీంలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఆదివారం ఉదయానికి ఆర్మీ బృందాలు సైతం ఘటనా స్థలానికి చేరుకునే అవకాశం ఉంది.

ఒకే మార్గం గుండా..

టన్నెల్ శిథిలాల్లో చిక్కుకున్న 8 మంది కార్మికులను రక్షించేందుకు చేపట్టిన సహాయక చర్యలకు పెద్దఎత్తున నీటి ప్రవాహం, బురద ఆటంకంగా మారాయి. ఇలాంటి సొరంగ పనుల నిర్వహణకు ఆడిట్ టన్నెళ్లు, ఎస్కేప్ టన్నెళ్లు కీలకంగా పనిచేస్తాయి. వీటి ద్వారా సొరంగంలో తొలగించిన మట్టి, రాళ్లు, శిథిలాల తొలగింపుతోపాటు సొరంగంలో ఎయిర్ ప్రెజర్‌ను సమన్వయం చేసేందుకు, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టేందుకు ఉపయోగపడతాయి. ఇలాంటివి ఏవీ ఆడిట్, ఎస్కేప్ టన్నెళ్లు ఈ ప్రాజెక్టులో లేవు. ప్రధాన సొరంగంతోపాటు అదనంగా ఆడిట్ టన్నెళ్ల నిర్మాణం చేపట్టేందుకు అటవీశాఖ అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. ఆడిట్ టన్నెళ్లు లేకపోవడం, ఒకే మార్గం గుండా సహాయక చర్యలు చేపట్టడం రెస్క్యూ బృందాలకు సవాలుగా మారింది.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర అధికారులు

సీపేజీనే ప్రమాదానికి కారణం..

శ్రీశైలం జలాశయం నుంచి నీటిని నల్లగొండ జిల్లాకు తరలించేందుకు ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. నల్లమల కొండలను తవ్వుకుంటూ సుమారు 40 కి.మీ., మేర టన్నెల్‌ను తవ్వాల్సి ఉండగా.. కృష్ణాతీరం నుంచి 13 కి.మీ., మరోవైపు అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి నుంచి 23 కి.మీ., టన్నెల్ తవ్వకం పూర్తయ్యింది. దోమలపెంట సమీపంలో ఎస్‌ఎల్‌బీసీ ఇన్‌లెట్ నుంచి 14 కి.మీ., వద్ద సొరంగం తవ్వకాలను గత నాలుగు రోజుల కిందటే మొదలుపెట్టారు. ఈ సొరంగంలో గత నాలుగేళ్లుగా నీటి సీపేజీ కొనసాగుతోంది. శనివారం ఈ నీటి ఉధృతి ఎక్కువై అప్పటికే బలహీనంగా మారిన పైకప్పు, రాక్ బోల్టింగ్, కాంక్రీట్ సెగ్మెంట్‌తోపాటు ఒక్కసారిగా కుప్పకూలింది. సీపేజీ నిర్వహణ, డీవాటరింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించడంతోపాటు భద్రతా ప్రమాణాలు పాటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



సొరంగం లోపల కూలిపడిన కాంక్రీట్ దిమ్మెలు

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

- శివరాత్రి నేపథ్యంలో రీజియన్ నుంచి 357 సర్వీసులు



స్టేషన్ మహబూబ్‌నగర్: మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. రీజియన్‌లోని 9 డిపోల నుంచి శ్రీశైలం వరకు 357 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రతి ఏడాది రీజియన్‌లోని డిపోల నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడుపుతారు. శివరాత్రి అనంతరం తిరుగు ప్రయాణం రోజుల్లో కూడా ప్రత్యేక బస్సులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో అచ్చంపేట డిపో నుంచి 58, గద్వాల నుంచి 15, కల్వకుర్తి 34, కొల్లాపూర్ 37, మహబూబ్‌నగర్ 85, నాగర్‌కర్నూల్ 56, నారాయణపేట 23, షాద్‌నగర్ 6, వనపర్తి డిపో నుంచి 43 ప్రత్యేక బస్సులు నడువనున్నాయి. ముఖ్యంగా మహాశివరాత్రి రోజు రీజియన్ నుంచి 151 బస్సులు నడపనున్నారు.

బస్సుల వివరాలు, తేదీల వారీగా..

డిపో	24న	25న	26న	27న	28న
అచ్చంపేట	4	8	12	24	10
గద్వాల	-	-	10	5	-
కల్వకుర్తి	2	4	18	6	4
కొల్లాపూర్	2	4	15	14	2
మహబూబ్‌నగర్	5	15	35	15	15
నాగర్‌కర్నూల్	5	11	20	15	5
నారాయణపేట	3	3	15	2	-
షాద్‌నగర్	-	-	6	-	-
వనపర్తి	5	6	20	10	2

సద్వినియోగం చేసుకోవాలి

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రీజియన్‌లోని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ తెలిపారు. శ్రీశైలంతోపాటు ఆయా బస్టాండ్లలో ప్రయాణికుల సౌకర్యార్థం చలువ పందిర్లు, తాగునీరు, వలంటీర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తంగా మారిన విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెట్టేందుకు చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బాలికల హాస్టల్ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధునాతన వసతులు కల్పిస్తూ బాలికల హాస్టల్ నిర్మించేందుకు పీఎం ఉషా పథకం కింద రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య, కనీస వసతులు కూడా కల్పించలేకపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రధానంగా కళాశాలలు, పాఠశాలల్లో వసతుల కల్పన కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. జిల్లాకేంద్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పక్కనే హాస్టల్ వసతి కల్పిస్తే మరిన్ని అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు సుధాకర్‌రెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంవీఎస్‌లో హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ

- 9 పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 4 బంగారు, 5 రజతం, 1 కాంస్య పతకాలు సాధించి సత్తాచాటారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శనివారం క్రీడాకారులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర అభినందించి.. శాలువాలతో సత్కరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, కోచ్‌లు ఆనంద్, సునీల్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో వినోద్‌కుమార్ తదితరులు

పతకాలు సాధించిన క్రీడాకారులు

అండర్-18 విభాగంలో కె.కార్తీక్ హైజంప్, హెప్టాథాన్‌లో బంగారు, అండర్- 18లో బి.పౌర్ణమి డిస్కస్త్రోలో బంగారు, అండర్- 18లో కీర్తన 1000 మీటర్ల పరుగులో బంగారు పతకాలు, అండర్-18లో కె.శివకుమార్ 200 మీటర్లు, 400 మీటర్ల పరుగులో రజతం, అండర్-18లో ఎం.నిఖిల్ హైజంప్‌లో రజతం, అండర్-16లో కె.హన్సిక హైజంప్‌లో రజతం, అండర్-16లో జీవన్ 400 మీటర్ల పరుగులో రజతం, పురుషుల విభాగంలో లింగం లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం సాధించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఆయిల్‌పాం సాగుపై రైతులు దృష్టిసారించాలి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వనపర్తి/కొత్తకోట రూరల్: దేశంలో ఉన్న మంచినూనె కొరతను అధిగమించి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగేందుకు రైతులు అత్యధికంగా ఆయిల్‌పాం సాగు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. దేవరకద్ర నియోజకవర్గంలోని సంకిరెడ్డిపల్లిలో ప్రీ యూనిక్ సంస్థ నిర్మించనున్న ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయిల్‌పాం రైతులతో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో వంటనూనెల లోటు భర్తీ చేయాలంటే 70 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేపట్టాల్సిన అవసరం ఉందని.. తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందే పంట ఆయిల్‌పాం మాత్రమే అన్నారు. ప్రస్తుతం ఆయిల్‌పాం గెలలు టన్నుకు రూ.20,487 ధర పలుకుతుందని త్వరలో రూ.25 వేలకు చేరుతుందని వివరించారు. ఆగస్టు 15 నాటికి కంపెనీ నిర్మాణం పూర్తిచేసి ప్రారంభిస్తామని.. అదేవిధంగా బీచుపల్లి వద్ద ఉన్న కంపెనీ మరమ్మతులు పూర్తిచేసి ఇదే సంవత్సరంలో వినియోగంలోకి తీసుకొస్తామని భరోసానిచ్చారు. జిల్లాలో 11 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఆయిల్‌పాం కంపెనీ నిర్మాణం ఎట్టకేలకు కార్యరూపం దాల్చిందని.. త్వరగా నిర్మాణం పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ ప్రతినిధులను కోరారు. ఆయిల్‌పాం సాగుతో ఏడాదికి ఎకరాకు రూ.1.50 లక్షల ఆదాయం వస్తుందని వివరించారు. అంతకుముందు పెద్దమందడి మండలం వెల్టూరులో ఆరోగ్య ఉప కేంద్ర భవనం, మోజర్లలో గోదాముల సముదాయానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెబ్బేరులో మరో వ్యవసాయ గోదాం, వ్యవసాయ కార్యాలయ అదనపు భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అదేవిధంగా కాలిన మార్కెట్‌యార్డు గోదాం పునర్నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, వనపర్తి మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, దేవరకద్ర మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్లు, కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సంకిరెడ్డిపల్లి శివారులో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

మహిళా సంఘాల బలోపేతానికి చర్యలు

పాలమూరు: జిల్లాలో మహిళ సంఘాలను బలోపేతం చేయడానికి కావాల్సిన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మహిళా సంఘాల బలోపేతంపై సీఆర్‌పీలతో సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాలు పంచసూత్రాలు పాటించే విధంగా వారికి కావాల్సిన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలన్నారు. సంఘాల బలోపేతం కోసం సెర్ప్ టీంలు, అదేవిధంగా 68 సీఆర్పీల టీంలు ఏర్పాటు చేసి ఒక్కో టీంలో ముగ్గురు మహిళా సంఘాల సభ్యులను ఏర్పాటు చేసి సంఘాల నిర్వహణ ఆర్థిక సాధికారత, స్వావలంబన దిశగా కావాల్సిన నైపుణ్యం పెంచుకోవడానికి సీఆర్‌పీల ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొదటి విడత కింద ఐదు మండలాల్లోని 20 గ్రామాల్లో 10 టీంలు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ నర్సింహులు, ఏపీడీ పాల్గొన్నారు.



వైభవంగా గంప జాతర

- లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- పడమట ప్రాంతంలో పండిన పంటలతో పాదయాత్ర
- గంగాపురంలో పండగ వాతావరణం

- జడ్చర్ల టౌన్

వివరాలు 8లో ▸

ఆశావహుల జేబుకు చిల్లు

పల్లెపోరులో జాప్యంతో కలవరపాటు

- దసరా నుంచి సాగదీతతో ఆర్థికంగా నష్టం
- నిత్యం దావత్‌ల పేరుతో తడిసిమోపెడు
- జిల్లాలో 423 గ్రామ పంచాయతీలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రామ పంచాయతీ ఎన్నికల పోరు ప్రక్రియ డైలీ సీరియల్ మాదిరి సాగుతూ వస్తోంది. దీంతో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల్లో కలవరపాటు మొదలైంది. గతేడాది జనవరి 31న పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. ప్రభుత్వం మొదట్లో పల్లెపోరును దసరా పండుగ తర్వాత నిర్వహిస్తామని తెలిపి.. అనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో సంక్రాంతికి వాయిదా వేసింది. ఈ క్రమంలోనే అధికార యంత్రాంగం స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సైతం చేసింది. అయినా నేటికీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకపోవడం గమనార్హం. మరోపక్క ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు నానా తంటాలు పడుతున్నారు. నిత్యం దావత్‌ల పేరుతో ఖర్చు తడిసి మోపెడవుతుందని వాపోతున్నారు. జిల్లాలో మొత్తం 423 గ్రామ పంచాయతీలు ఉండగా.. అందులో సర్పంచ్ పదవికి పోటీ చేసే వారి సంఖ్య గణనీయంగానే ఉందని ప్రాథమిక అంచనా.



ధర్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

గ్రూప్ రాజకీయలతో పరేషాన్..

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. దీంతో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు పలువురు పోటీ పడుతున్నారు. ఈ సంఖ్య కాస్త ఎక్కువగానే ఉండటంతో వర్గాలుగా విడిపోయారు. అదిగో.. ఇదిగో.. ఎన్నికలంటూ ప్రభుత్వ ప్రకటనలతో గ్రామాల్లో వేడెక్కిన వాతావరణం.. వాయిదాల పర్వంతో తర్వాత ఒక్కసారిగా స్తబ్దుగా మారింది. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు రెండు నుంచి మూడు వర్గాలుగా విడిపోయి లాబీయింగ్ మొదలుపెట్టారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు నడిపించిన నాయకులు ఒక వర్గంగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ పెద్దల హామీలతో కాంగ్రెస్‌లోకి వచ్చిన వారు మరో వర్గంగా ఏర్పడి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. నిత్యం ఏదో ఒక చోట కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ మనకే టికెట్ అంటూ ప్రచారాలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా.. గ్రామాన్ని సక్రమంగా పాలించే మంచి నాయకుడు పోటీలో ఉంటే గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనే అభిప్రాయం స్థానికంగా వ్యక్తమవుతుంది.

ఇక నువ్వే సర్పంచ్..

గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేయడానికి సిద్ధపడుతున్న ఆశావహులు కొన్ని నెలలుగా మద్దతుదారులను వెంటపెట్టుకుని స్థానికంగా హల్‌చల్ చేస్తున్నారు. మధ్యాహ్నం వెంట తిరగడం.. రాత్రికి దావత్ చేసుకోవడం వంటి కార్యక్రమాలు పల్లెల్లో జోరుగా సాగుతున్నాయి. 'ఇక నువ్వే సర్పంచివి.. నీకు తిరుగులేదు' అంటూ పొగడ్తలతో ఆశావహులను ఆకాశానికి ఎత్తి జేబులు ఖాళీ చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఇంకా ముందుకు సాగదీస్తే మాత్రం ఆశావహులు అప్పుల పాలు కావాల్సిందే అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరి ప్రభుత్వం పల్లెపోరు ఎప్పుడు నిర్వహిస్తుందో.. వేచిచూడాలి.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ప్రభుత్వ ఉద్యోగి మృతి


రాముడు (ఫైల్)

గట్టు: ధరూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసే రాముడు (39) శనివారం స్వగ్రామం గంగిమాన్‌దొడ్డిలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాముడు గట్టు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పని చేస్తూ ఏడాదిన్నర కిందట ధరూరు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లాడు. ఉదయం పొలానికి వెళ్లి వచ్చిన రాముడు ఇంటి నిర్మాణంలో భాగంగా పునాదులను తడిపేందుకు బోరుమోటార్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ఇళ్లవారు హుటాహుటిన గద్వాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. రాముడుకు భార్య పద్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ మల్లేశ్ వివరించారు.

పలువురి పరామర్శ..

బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బాసు శ్యామల, బీఆర్ఎస్ నేత బల్గెర హనుమంతునాయుడు గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు.

చెరువులో పడి వ్యక్తి..

తెలకపల్లి: చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ వివరాల మేరకు.. తెలకపల్లికి చెందిన లింగమయ్య (58) గ్రామ సమీపంలోని పెద్దచెరువులో స్నానం చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతుడి భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

ట్రాక్టర్, కంటైనర్ ఢీ : ఒకరి దుర్మరణం

మానవపాడు: ట్రాక్టర్, కంటైనర్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం తెల్లవారుజామున జల్లాపురం శివారు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా బేతంచర్ల మండలం గొర్లగుట్టకు చెందిన బాబు (35) ట్రాక్టర్‌లో బండలు నింపుకొని బేతంచర్ల నుంచి గద్వాలకు బయలుదేరాడు. మండలంలోని జల్లాపురం శివారుకు రాగానే జాతీయ రహదారిపై బెంగుళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ వెనుక నుంచి వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాలీ బాబుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవాబుపేట: పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చౌడూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విక్రమ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాకలి కృష్ణయ్య (22)కు అనారోగ్య సమస్యలతో రెండు కాళ్లు పని చేయకుండా అయ్యాయి. దీంతో ఆరునెలల కిందట ఒక కాలుకు హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించగా.. రెండో కాలుకు మరో వారం రోజులో చేయాల్సి ఉంది. శస్త్రచికిత్స చేసినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుమందు తాగాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి పకీరయ్య ఫిర్యాదు మేరకు శనివారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

బాలిక బలవన్మరణం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో ఓ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి సీఐ కమలాకర్ కథనం ప్రకారం.. పట్టణంలోని దేపల్లి రాజు కూతురు సాయిమనస్వి(15) పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. అయితే స్కూల్ ఫీజు చెల్లించనందున మూడురోజులుగా ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలోనే శనివారం ఇంటి వద్ద ఉన్న బాలిక ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మృతిచెందింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై బాలిక తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


లక్ష్మీచెన్నకేశవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


గంపలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా..

చెన్నకేశవా.. కరుణించవయ్యా

ఘనంగా గంప జాతర
- గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- పడమర ప్రాంతం నుంచి పండిన పంటలతో పాదయాత్ర


ఆలయ ప్రాంగణంలో నైవేద్యం సిద్ధం చేస్తూ..

జడ్చర్ల టౌన్: గంగాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం గంప జాతర ఘనంగా జరిగింది. ప్రతి ఏటా మాఘమాసం తొలి వారంలో స్వామికి బ్రహ్మోత్సవాలు జరిపించడం.. ప్రతి రెండేళ్లకోసారి ఇదే మాసంలో చివరి శనివారం గంప జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. చెన్నకేశవ వస్తున్నామయ్యా అంటూ పడమర ప్రాంతమైన నారాయణపేట, కోయిల్‌కొండ, కోస్గి, కొడంగల్, మద్దూర్ ప్రాంతాల నుంచి భక్తులు పండించిన ధాన్యం, బెల్లం, ఇతర దినుసులను ప్రత్యేకంగా అలంకరించిన గంపలో పెట్టుకుని పాదయాత్రగా లక్ష్మీచెన్నకేవస్వామి ఆలయాన్ని సందర్శించారు. శుక్రవారమే వారు గంపలతో బయలుదేరగా.. నెత్తిన పెట్టుకున్న గంపను దించకుండా ఒకరి తర్వాత మరొకరు కుటుంబ సభ్యులు తలపై మోస్తూ లక్ష్మీచెన్నకేశవుడి చెంతకు చేరుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. చెన్నకేశవుడి, గోవిందనామస్మరణతో మార్మోగింది.

పెద్దగుట్ట నామాలగుండు చెన్నకేశవుడి దర్శనం..

గంప జాతరకు ఆయా ప్రాంతాల నుంచి బయలుదేరిన భక్తులు ముందుగా బాదేపల్లి పెద్ద గుట్టపై వెలసిన చెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. అక్కడ టెంకాయలు సమర్పించిన అనంతరం తిరిగి గంపలను తలపై పెట్టుకుని గంగాపురం శివారులోని వీరభద్రుడి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఊరేగింపుగా గంగాపురం గ్రామానికి చేరుకుని లక్ష్మీచెన్నకేశవుడి ఆలయం ఎదురుగా ఉన్న రథం చుట్టూ గంపలతో ప్రదక్షిణలు చేశారు. గంప జాతరను పురస్కరించుకొని యాదవులు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. నెమలి పింఛాలను చేతబూని నృత్యాలు చేస్తూ ఊరేగింపు ఆసాంతం ముందుకుసాగారు. స్వామివారి గర్భగుడి వద్ద ప్రదక్షిణల అనంతరం వంటావార్పు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. కొందరు తలనీలాలు సమర్పించగా.. మరికొందరు గోవులను దానం చేశారు. గంప జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

హరహర మహాదేవ.. శంభో శంకర

- శ్రీశైలం క్షేత్రానికి కాలినడకన తరలివెళ్తున్న భక్తులు
- దారి పొడవునా అన్నదానాలు, వైద్యశిబిరాలు


భక్తులకు పలహారం అందిస్తున్న దాతలు

అచ్చంపేట: హరహర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమఃశివాయ అంటూ భక్తులు కాలినడకన శ్రీశైలం క్షేత్రానికి తరలివెళ్తున్నారు. శివనామస్మరణతో నల్లమల గిరులు మార్మోగుతున్నాయి. శ్రీశైలేశుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19న ప్రారంభం కాగా.. వివిధ ప్రాంతాల నుంచి మాలధారులు, భక్తులు కాలినడకన వెళ్తున్నారు. మరికొందరు వాహనాల్లో భారీగా తరలివెళ్తుండటంతో ప్రధాన రహదారి రద్దీగా మారింది. పాదయాత్ర చేపట్టిన భక్తులకు దారి పొడవునా దాతలు అన్నదానాలు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు మజ్జిగ, తాగునీటిని అందిస్తూ ఆకలి, దాహం తీరుస్తున్నారు. వైద్యసిబ్బంది ప్రత్యేకంగా శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎండ ప్రభావంతో అస్వస్థతకు గురయ్యే వారితో పాటు ఇతరత్రా అనారోగ్యం బారిన పడే వారికి అవసరమైన వైద్యం అందిస్తున్నారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు..

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం క్షేత్రానికి ఉమ్మడి జిల్లాతో పాటు రంగారెడ్డి, హైదరాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. కాలినడకన వెళ్లిన భక్తుల తిరుగు ప్రయాణం కోసం బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేశారు. అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. శనివారం నుంచే అచ్చంపేట డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఏ రోజుకారోజు బస్సుల సంఖ్య పెంచుతూ.. సుమారుగా జిల్లా నుంచి వంద వరకు బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసుకుంది.

ఇసుక ట్రాక్టర్లు, పొక్లెయిన్ పట్టివేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మణిగిల్ల బుగ్గపల్లి తండాలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ని పట్టుకున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు తెలిపారు. వివరాలు.. అనుమతుల్లేకుండా మణిగిల్ల వాగు నుంచి మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకను తయారుచేస్తూ కొత్తకోట, వనపర్తి, పెద్దమందడి మండలంలోని వివిధ గ్రామాలకు తరలిస్తున్నారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈమేరకు వనపర్తి (స్పెషల్ బ్రాంచ్) ఎస్బీ కానిస్టేబుళ్లు బాలరాజు, సాగర్, శేఖర్ రెండు ఇసుక ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ని అదుపులోకి తీసుకున్నారు. వీటిని పెద్దమందడి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు.

మన్యంకొండ.. జనసంద్రం


కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం జనసంద్రమైంది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి తరలి రావడంతో మన్యంకొండ కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా దేవస్థానం ముందున్న కోనేరులో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే భక్తులు దర్శనానికి కోనేరు పక్కనున్న ప్రధాన ద్వారం నుంచి గర్భగుడి వరకు భక్తులు బారులు తీరారు. కొంతమంది భక్తులు మొక్కుబడి ప్రకారం స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలు సమర్పించారు. మరికొంత మంది తలనీలాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానంతోపాటు పక్కన ఉన్న శివాలయంలో కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దిగువకొండ వద్ద ఉన్న దుకాణ సముదాయం, కోనేరు, దేవస్థానం ముందు, తేరు మైదానం వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానం వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల్లోని విశేష సేవలు అయిపోయినప్పటికీ భక్తులు మన్యంకొండకు రావడం తగ్గడం లేదు. అందులో భాగంగానే శని, సోమవారాల్లో భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

వైభవంగా శేషవాహనసేవ

మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి శేషవాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంలో స్వామివారిని గర్భగుడి నుంచి రథాల మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. భక్తుల హరినామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. బంగారు ఆభరణాలు, రకరకాల పూల అలంకరణలో స్వామివారు లైట్ల వెలుతురులో ధగధగ మెరిసిపోతూ శేషవాహనంలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. అనంతరం రథాల మంటపం వద్ద తదితర పూజలు నిర్వహించి తిరిగి మళ్లీ శేషవాహనంలో స్వామివారిని గర్భగుడిలోకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కదులుతున్న డొంక


- నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ కొలువులకు దరఖాస్తు
- ఏపీ, తెలంగాణ, ఇతర రాష్ట్రాల వారు సర్టిఫికెట్లు పొందిన వైనం
- ఇంటెలిజెన్స్ విచారణలో అసలు విషయాలు వెలుగులోకి..
- తాజాగా ఇద్దరి అరెస్టు.. రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మొగిలయ్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగిలయ్య

గద్వాల క్రైం: నకిలీ సర్టిఫికెట్ల ముఠా డొంక కదులుతోంది. నకిలీ డిప్లొమా సర్టిఫికెట్‌తో ఓ వ్యక్తి ఏకంగా వ్యవసాయ శాఖలో ఏఈఓ ఉద్యోగం పొందడంతోపాటు ఐదేళ్లు చలామణి కావడం.. ఇంటెలిజెన్స్ విచారణలో ఈ వ్యవహారం బయటపడడం, ఇటీవల సదరు వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. తాజాగా చీటింగ్ కేసుకు సంబంధించి పోలీసులు విచారణ వేగవంతం చేశారు. మొత్తం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే.. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట మండలం లింగోటతండాకి చెందిన కాట్రావత్ నరేష్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘాజీపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2013లో అగ్రికల్చర్ డిప్లొమా చేసినట్లు, లింగాల మండలం క్యాంపు రాయవరం గ్రామానికి చెందిన పేరుమల్ల నాగరాజు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హాండియాలో 2009లో అగ్రికల్చర్ డిప్లొమా పూర్తి చేసినట్లు నకిలీ సర్టిఫికెట్లు పొందారు.

ఏఈఓ పోస్టుకు దరఖాస్తు..


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ డిప్లొమా సర్టిఫికెట్లు

2016లో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖలో ఖాళీలను భర్తీ చేసేందుకు ఉపక్రమించగా.. నకిలీ సర్టిఫికెట్లు పొందిన కాట్రావత్ నరేష్, పేరుమల్ల నాగరాజు సైతం పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసి పరీక్ష సైతం రాశారు. అయితే ఇద్దరిలో కాట్రావత్ నరేష్‌కు 2017లో ఎస్టీ రిజర్వేషన్ కోటాలో ఏఈఓగా అర్హత సాధించాడు. 28.01.2017న జోగుళాంబ గద్వాల జిల్లా గట్టులో వ్యవసాయ శాఖలో ఏఈఓగా ఉద్యోగంలో చేరి, మల్దకల్ మండలంలో 2019 మార్చి వరకు పనిచేశాడు. ఈ క్రమంలో డిప్యూటేషన్‌పై 2019 మార్చిలోనే నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం కోమటికుంట గ్రామానికి బదిలీపై వెళ్లాడు. అయితే ఇక్కడే అతని విద్యార్హతకు సంబంధించి పూర్తి వివరాలను ఇంటెలిజెన్సీ విభాగ అధికారులు విచారించగా నకిలీ డిప్లొమా సర్టిఫికెట్ విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పగా.. 2017 నుంచి 2023 వరకు ప్రభుత్వాన్ని మోసం చేసి జీతం పొందినట్లు ధ్రువీకరించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సంగీతలక్ష్మి ఫిర్యాదు మేరకు 2024 మార్చి 15న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే నిందితుడు 2024 జనవరిలో విధులకు రాజీనామా చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఎట్టకేలకు నిందితుడు గద్వాలలోని పీజేపీ క్యాంపు సమీపంలో ఈ నెల 21న ఉన్నట్లు సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన జగదీష్, శివశంకర, రవీందర్, జర్పుల డాక్యా, పేరుమల్ల నాగరాజుతోపాటు మరికొందరు నకిలీ సర్టిఫికెట్లు పొందినట్లు తెలిసింది. ఇందులో పేరుమల్ల నాగరాజు స్వగ్రామంలో ఉన్నట్లు సమాచారం రావడంతో అతడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

మిర్యాలగూడ కేంద్రంగా దందా

మిర్యాలగూడకు చెందిన బాలకృష్ణ సొంతంగా కళాశాల నడుపుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ డిప్లొమా కళాశాలలకు సంబంధించిన సర్టిఫికెట్లను రూ.1.20 లక్షలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తెలిసిందని డీఎస్పీ వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు సైతం నకిలీ సర్టిఫికెట్లు పొందినట్లు గుర్తించామన్నారు. ఈ దందాలో ప్రధాన సూత్రదారి బాలకృష్ణపై కేసు నమోదు చేశామని, త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడతామన్నారు. ఇంకా ఎంతమంది నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ కొలువులు పొందారనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు నిందితుల నుంచి నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నామని, వారిని గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసు విచారణలో సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. సమావేశంలో గద్వాల సీఐ శ్రీను, పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్, చంద్రయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

జడ్చర్ల టౌన్: విదేశాల్లో పనిచేసే కార్మికుల ప్రయోజనార్థం బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించామని టీయూసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్పీ తివారి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని ఓ సమావేశ మందిరంలో జరిగిన సంఘం తెలంగాణ రాష్ట్ర మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశం నుంచి 2.30 లక్షల మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారని, వారంతా డబ్బు సంపాదించి కుటుంబాలు, పిల్లలు, విద్య కోసం పంపించింది రూ.64 వేల కోట్లుగా వెల్లడించారు. కేంద్రంతో ఇంటర్నేషనల్ ఇమ్మిగ్రంట్ బోర్డు ఏర్పాటు చేసి ఏజెంట్లు తప్పుదోవ పట్టించకుండా చూడాలన్నారు. తెలంగాణ బోర్డు ఏర్పాటు చేయడం అభినందనీయమని, అలాగే కర్ణాటక, కేరళలో బోర్డులున్నా సక్రమంగా పనిచేయడం లేదని, యూపీ, తమిళనాడులో త్వరలో బోర్డు ఏర్పాటు కానుందని తెలిపారు. అదేవిధంగా వర్కింగ్ జర్నలిస్టుల కోసం బోర్డు ఏర్పాటుచేసి సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామన్నారు. అంగన్‌వాడి, భవన నిర్మాణ, వలస కార్మికులను ఈఎస్ఐ, పీఎఫ్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు మార్చి 15లోగా నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని వెల్లడించారు. పుట్టిన ప్రతి బిడ్డకు పీఎఫ్ అమలయ్యేలా చూడాల్సిన ఆవశ్యకత ఉందని.. ఇందుకోసం టీయూసీసీ పాటుపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా టీయూసీసీ సభ్యుల సంఖ్య 25 లక్షలకు చేరిందని, కోటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌రావు, రాష్ట్ర నాయకులు చాంద్‌ఖాన్, సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, నాయకులు యాదయ్య, రాంమోహన్, కృష్ణారెడ్డి, యాదగిరి, ఇంజనీర్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ తివారి

విద్యార్థుల అస్వస్థతపై విచారణ

- వైస్ చాన్స్‌లర్ ప్రొ. మీన చింతమనేని


మాట్లాడుతున్న యూనివర్సిటీ పెద్దలు

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి ఎస్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థుల అస్వస్థత ఘటనపై విచారణకు కమిటీ వేశామని.. త్వరలో వివరాలు వెల్లడిస్తామని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. మీన చింతమనేని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 20న మొదట నలుగురు విద్యార్థులు కొంత అస్వస్థతకు గురికాగా డీఆర్ మహేష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారని, మధ్యాహ్నం సమయానికి ఆ సంఖ్య 27కు చేరిందన్నారు. అప్పటికే యూనివర్సిటీలోని వైద్యులు, నర్సులు ప్రాథమిక చికిత్స అందించారని, అదే సమయంలో వచ్చిన ఎమ్మెల్యే సూచనల మేరకు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించామన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో లా విద్యార్థులే అధికంగా ఉన్నారని.. దీంతో పరీక్ష వాయిదా వేశామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను డిశ్చార్జ్ చేశారని, కొందరిని మాత్రం అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు సూచించారన్నారు. తమ 6 యూనివర్సిటీల్లో ఎక్కడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని, ఇదే ప్రథమమని.. అందుకే విచారణ కమిటీ వేశామని చెప్పారు. సమావేశంలో డా. అభిషేక్ రంజన్, డీఆర్ డా.మహేష్‌కుమార్, డా. అశ్విని దేశ్‌పాండే పాల్గొన్నారు.

ప్రేమ వ్యవహారంలో యువతి ఆత్మహత్య

కల్వకుర్తి టౌన్: ప్రేమ వ్యవహారంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఏఎస్ఐ శ్రీనివాస్, కాలనీవాసుల వివరాల మేరకు.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో నివాసముండే అనూష (20) స్థానికంగా ఉన్న ఓ డిగ్రీ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతుంది. ఆమెకు పట్టణంలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థితో ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. అయితే మంగళవారం సదరు విద్యార్థితో అనూష ఫోన్‌లో మాట్లాడిన అనంతరం పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు, కాలనీవాసులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. అనూష మృతిపై అనుమానం వ్యక్తంచేస్తూ ఆమె సోదరుడు అరవింద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. గురువారం కేసు నమోదు చేశారు. అయితే పోస్టుమార్టంలో యువతి గర్భవతిగా నిర్ధారణ కావడంతో కేసు విషయాన్ని స్థానిక నాయకులు బయటకు పొక్కనివ్వకుండా వ్యవహారం నడిపించారనే ఆరోపణలు ఉన్నాయి. యువతి చనిపోవడంతో తప్పదన్నట్లుగా కేసు నమోదు చేశారనే చర్చ జోరుగా సాగుతోంది. ఈ విషయమై ఏఎస్ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు విచారణ కొనసాగుతుందని, యువతి కాల్‌డేటా ఆధారంగా కేసును త్వరలోనే ఛేదిస్తామన్నారు. ఇదిలా ఉంటే, యువతి ఆత్మహత్య చేసుకునే ముందు సదరు విద్యార్థితో మాట్లాడిన ఫోన్ సంభాషణ రికార్డులు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం కావడంతో ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.